కొండంత ఆసరా

- వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత
- మహిళలకు సీఎం జగన్ అన్ని విధాలా అండ
- ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి ఉషశ్రీచరణ్



రొద్దం: ఆసరా వారోత్సవాల సభలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



రొద్దంలో సభకు హాజరైన డ్వాక్రా మహిళలు





గోరంట్ల: మహిళా సంఘం సభ్యులకు ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్ , గోరంట్ల: పెద్దసంఖ్యలో హాజరైన మహిళా సంఘాల సభ్యులు

గోరంట్ల: మహిళా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత మెగా చెక్కును ఆమె మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కుల,మత, రాజకీయాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రపంచస్థాయి విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెడుతోందన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని గుర్తుచేశారు. అప్పుల ఊబిలో కురుకుపోయిన మహిళా సంఘాలను ఆదుకోవడానికి రూ.25 వేల కోట్లు వెచ్చించి నాలుగు విడతల్లో మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 30 లక్షల ఇళ్లను మహిళలకు ఆస్తిగా ఇచ్చిన ఏకైక సీఎం కూడా జగనేనన్నారు. సంక్షేమ పథకాలు విరివిగా ఇస్తే రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని చంద్రబాబు, ఎల్లో పత్రికలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశాయన్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరోసారి ప్రజలను మోసం చేయడానికి ఆచారణకు సాధ్యంకాని హామీలతో ప్రజలవద్దకు వస్తున్నారన్నారు. పేదలకు మరింత మంచి జరగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. అనంతరం రూ.9.43 కోట్ల మెగా చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ సరోజబాయి, జెడ్పీటీసీ సభ్యులు జయరాంనాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, కురబ రామలక్ష్మమ్మ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, నాయకులు నార్సింపల్లి శివారెడ్డి, రఘురామిరెడ్డి, మేదరశంకర, నాగేనాయక్, సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రొద్దకాంబదేవి ఆలయ ఆవరణలో డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత మెగా చెక్ పంపిణీ జరిగింది. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తారని... చేయగలిందే చెబుతారని అన్నారు. పాదయాత్రలో మహిళ సంఘం సభ్యులను రుణాల నుంచి విముక్తి చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే రాష్ట్ర వ్యాప్తంగా 7.97 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 78.76 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు 4 విడతలుగా రూ 25,517 కోట్లు పంపిణీ చేశారని తెలిపారు. రొద్దం మండలంలో 874 సంఘాల్లో 8,864 మంది సభ్యులకు రూ 8 కోట్ల, 34 లక్షలా 54 వేలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కరోనాతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చెప్పిన మాట ప్రకారంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. చంద్రబాబు డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అక్కచెల్లెమ్మలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎంపీడీఓ కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్ రూప, ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, రాష్ట్ర స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, రొద్దం, కలిపి సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, నాయకులు అక్కులప్ప, మారుతీరెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎన్ నారాయణరెడ్డి తదితరులు మహిళలు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

గోరంట్ల: అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18న నిర్వహించనున్న సిద్ధం సభను వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం గోరంట్ల పట్టణంలో పార్టీ శ్రేణులతో కలసి సిద్ధం సభ పోస్టర్లను విడుదల చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోరంట్ల: మండల కేంద్రంలోని నాల్గవ సచివాలయ పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న నస్రీనా అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ గోరంట్లలోని నస్రీనా నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక





లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక , హాజరైన డ్వాక్రా మహిళలు

లేపాక్షి: 'రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు. అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు' అని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపిక తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. మొదట వైఎస్సార్ క్రాంతి పథం ఏపీ రామిరెడ్డి నివేదికను చదివి వినిపించారు. మండలంలో 559 సంఘాలకు నాలుగు విడతల్లో మొత్తం రూ. 16.44 కోట్లు మాఫీ చేశారన్నారు. అనంతరం దీపిక మాట్లాడుతూ గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన అనంతరం రుణాలు మాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారన్నారు. 2019లో పసుపు కుంకుమ పేరుతో వంచించారన్నారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం ఆసరా డబ్బును అక్క చెల్లెమ్మల బ్యాంకు అకౌంట్లలో వేస్తున్న ఘనత మాత్రం సీఎం వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడి వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా పాటు పడుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వాదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తా, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచులు ఆదినారాయణ, మంజునాథ్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్, కోఆప్షన్ సభ్యులు బషీర్, మండల సమాఖ్య అధ్యక్షులు శారద, నాయకులు వేణుగోపాల్ చలపతి, ప్రభాకర్‌రావు, వైఎస్ తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల పనితీరు అధ్వానం



రొద్దంలో సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: అంగన్‌వాడీ సెంటర్లలో అంగన్‌వాడీ వర్కర్లు సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని సానిపల్లి సర్పంచ్ పరమేష్ మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా సరిగా లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పావగడకు ఢిల్లీ పోలీసులు

పావగడ: కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఫోన్ ద్వారా బెదిరించిన నిందితుడి ఆచూకీ కోసం ఢిల్లీ పోలీసులు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వారి సహకారంతో వెంకటాపురానికి చేరుకుని నిందితుడు రజనీశ్ ఇంటిని శోధించారు. ఇంటి తలుపుకు గడియ పెట్టుకున్న రజనీశ్ ఎంతకూ తలుపు తీయలేదు. అయితే అతడు మానసిక వ్యాధి గ్రస్తుడని పిచ్చిగా ప్రవర్తింటాడని తెలిపి స్థానికులు నిందితుడిని అరెస్ట్ చేయకుండా అడ్డుకున్నారు. దీంతో ఢిల్లీ పోలీసులు వెనుతిరిగారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్

గుడిబండ: మండల కేంద్రంలోని సచివాలయాన్ని డీపీఓ విజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. ఆర్థిక ప్రణాళిక నిధులను పంచాయతీ అభివృద్ధికి పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



హిందూపురం అర్బన్: పట్టణంలోని చిన్న మార్కెట్ సర్కిల్ వద్ద మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్‌తో మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే తన సెల్ నంబర్ 9440796845కు సమాచారం ఇవ్వాలని సీఐ రియాజ్ అహమ్మద్ కోరారు.

పట్టు పురుగుల పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల దిగువ గొల్లహట్టి గ్రామంలో పట్టు పరిశ్రమశాఖ ఏడీ రాజు పర్యటించారు. పట్టు రైతు జయన్న పెంపకం చేపట్టిన పట్టు పురుగులు నేత్రికల్లో గూడు అల్లక మృతి చెందుతుండటంతో పరిశీలించారు. మృతి చెందిన పురుగులు, ఆకు తీసుకొచ్చామని వాటిని పరీక్షించిన తర్వాత ఎందుకు చనిపోతున్నాయో తెలుస్తుందన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

మడకశిర: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి కోరారు. మంగళవారం పెనుకొండ రోడ్డులోని విజయభారతి కళాశాలలో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



ఆలయం వద్ద ప్రాణప్రతిష్ట పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని దండురోడ్డులో మేళాపురం ఆంజనేయస్వామి దేవాలయం మాన్యం ప్రాంగణంలో మంగళవారం ఏకశిలా హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ట వేడుకలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. మంగళవారం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద హోమ కార్యక్రమాలు ప్రారంభించారు. 14న ప్రాణప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పలుచోట్ల డ్రైనేజీల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. రూ.5.50 లక్షల మండల పరిషత్ గ్రాంట్ ద్వారా తహసీల్దార్ కార్యాలయం లైన్, ఉర్దూ పాఠశాల సమీపంలో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టినట్టు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తెలిపారు.

పారదర్శకంగా అనుమతులు ఇవ్వాలి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఇళ్ల నిర్మాణానికి పారదర్శకంగా అనుమతులు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప ఒక ప్రకటనలో కోరారు. తన వినతి మేరకు మున్సిపల్ అధికారులు నూతన ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఇవ్వాలని ప్రజలను కోరడం హర్షణీయమన్నారు. మున్సిపల్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు.

పార్టీ కేంద్ర కార్యాలయంలో...

తాను మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. పార్టీ పెద్దలు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారన్నారు.

మడకశిరలో స్పెయిన్ బృందం పర్యటన

మడకశిరరూరల్: మడకశిర మండలంలో స్పెయిన్ దేశానికి చెందిన ఆర్డీటీ స్పాన్సర్ బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. ఉప్పిడిపల్లిలో ఆర్డీటీ నిర్మించిన చెక్‌డ్యాంలను పరిశీలించారు. అనంతరం వంద ఎకరాల్లో చింత మొక్కలు నాటి నీరు పోశారు. ఆర్డీటీ అందించే సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ బీరలింగప్ప, ఆర్డీ మల్లికార్జున, ఎస్టీఎల్ లక్ష్మీకాంతమ్మ , ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మార్కెట్ల వేలం

హిందూపురం: పట్టణంలో వివిధ మార్కెట్ల రుసుముల వసూలు హక్కుల కోసం వేలం పాటలను మంగళవారం నిర్వహించారు. పెద్దమార్కెట్, రోడ్ల మార్జిన్ అమ్ముకునే వస్తువుల ఫీజు వసూలు కోసం గత ఏడాదికన్నా రూ.50 వేలు అధికంగా రూ.42 లక్షలకు రామాంజినేయులు అనే వ్యక్తి వేలం పాడి దక్కించుకున్నారు. అలాగే చిన్న పశువుల తోళ్ల మార్కెట్‌లో మెహజబీన్ రూ.7.11 లక్షలకు వేలం దక్కించుకున్నారు. పెద్ద పశువుల మార్కెట్ వేలాన్ని పిరీన్ రూ.1.17 లక్షలకు వేలం పొందారు. పరిగి బస్టాండ్‌లో ఖాళీ స్థలాన్ని అన్వర్‌ఖాన్ రూ.17.51 లక్షలకు వేలం దక్కించుకున్నారు.

ఆలయ వార్షికోత్సవం

హిందూపురం: స్థానిక నానెప్పనగర్‌లోని గాయత్రీ ఆలయంలో మంగళవారం ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉచిత ఉపనయనాలు నిర్వహించారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం కరీం మృతి



పరిగి: మండలంలోని సేవామందిరం ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ బి కరీం (61) సోమవారం రాత్రి అనారోగ్యంతో చనిపోయారు. పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కరీం ఎనలేని సేవలందించారు. కరీం భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఆయన స్వస్థలం కర్నూలు జిల్లా నందికొట్కూరుకు తరలించారు. ఆయనకు భార్య ఫాతిమా, కుమారుడు ఇస్మాయిల్, కుమార్తెలు జుబేదా, రేష్మా ఉన్నారు. ప్రిన్సిపాల్ కరీం మృతికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఈరక్యాతరాయప్ప (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని దాసప్పపాళ్యానికి చెందిన ఈరక్యాతరాయప్ప (64) బెంగళూరు ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం శిరా తాలూకా హుచ్చగిరేనహళ్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈరక్యాతరాయప్ప తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలోనే గాయపడిన నాగన్న, నరసింహమూర్తి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వరుసగా నలుగురు మృత్యువాత పడడంతో దాసప్పపాళ్యంలో విషాదఛాయలు అలముకున్నాయి.

క్లుప్తంగా

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మహా గణపతి పూజ, కలశ స్థాపన, దీక్షా హోమం, ధ్వజారోహణ తదితర పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో ప్రతిభ



గగన్ శ్యామ్‌రెడ్డి



ఆసిమ్‌ఖాన్

హిందూపురం టౌన్: జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సువర్ణభారతి కళాశాల యజమాని నీలకంఠరెడ్డి, విజయలక్ష్మీ కుమారుడు గగన్ శ్యామ్‌రెడ్డి 99.587 శాతం సాధించారు. అలాగే ఇంద్రవంశీరెడ్డి 94.86 శాతం, సారిక 88.58 శాతం, మనోజ్ 86.7 శాతం, జాలశ్రీ 83.08 శాతం, రక్షిత 82.95 శాతం, మానస 81.77 శాతం, అశ్విన్ 81 శాతం సాధించారు. అలాగే నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి పీ.ఆసిమ్‌ఖాన్ జేఈఈ పరీక్షల్లో 99.24 శాతం సాధించాడు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని సూగురు సడ్లపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.లక్ష విరాళమిచ్చారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన అత్తార్ మహమ్మద్ జుల్ఫిఖర్, షేక్ అస్పియా అంజుమ్

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి ఖురాన్ పఠన పోటీల్లో స్థానిక ఇఖ్రా పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి, రెండో స్థానంలో నిలిచి ప్రతిభ చూపారు. ఈ నెల 11న యూఎస్‌క్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో 9వ రాష్ట్రస్థాయి ఖురాన్ పఠన పోటీలు నిర్వహించారు. 2వ తరగతి విద్యార్థి అత్తార్ మహమ్మద్ జుల్ఫిఖర్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాడు. అలాగే 4వ తరగతి విద్యార్థి షేక్ అస్పియా అంజుమ్ రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. వారిని జామియా మసీదు ముతవల్లి నూరుల్లా, ఖాజా మౌలి ముక్తియార్, పాఠశాల చైర్మన్ నజరుద్దీన్ అభినందించారు.

కట కటాల్లోకి కామాంధుడు

పావగడ: ఓ కామాంధుడికి మధుగిరి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఏపీపీ నిరంజన్ వివరాల మేరకు.. వైఎన్ హొసకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగుడ్డ గ్రామంలో హనుమంతరాయప్ప అనే వ్యక్తి ఇంట్లో ఎవరూలేని సమయంలో తన కోడలితో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. అతని వికృత చేష్టలతో మనస్తాపం చెందిన ఆమె 2021 ఆగస్టు 7న ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నేరం రుజువు కావడంతో మధుగిరి కోర్టుహనుమంతరాయప్పకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధించింది.

నేడు ఆలయ ప్రారంభోత్సవం



అయ్యప్పస్వామి మూలవిరాట్

గుడిబండ: మండల కేంద్రంలోని సంతమార్కెట్ ఆవరణలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయాన్ని బుధవారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివార్ల ప్రతిష్ట అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు. కర్ణాటక రాష్ట్ర కొరటగెర తాలూకా శ్రీక్షేత్రం సిద్ధరబెట్ట మఠాధీశులు హాజరవుతారన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

లేపాక్షి: మండలంలోని తిమ్మగానపల్లిలో ఇళ్లులేని 25 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలను హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపిక మంగళవారం పంపిణీ చేశారు. అలాగే వడ్డిపల్లిలో శ్మశాన వాటిక లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పట్టా మంజూరు చేయించారు. శ్మశాన వాటిక పట్టాను గ్రామస్తులకు అందజేశారు.

గ్రంథాలయాలకు పుస్తకాల అందజేత

హిందూపురం టౌన్: పుస్తకాలు గతానికి, భవిష్యత్తుకు అనుసంధాన కర్తలని ఎంఈఓ గంగప్ప అన్నారు. మంగళవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో నాలుగు మండలాల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఉపాధ్యాయులు సిద్దగిరి శ్రీనివాస్ రచించిన నొళంబవాడి చారిత్రక పరిశోధన పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేశారు. స్థానిక సింధూరి హోటల్ యజమాని శ్రీనివాస్ తన మిత్రుడు సిద్దగిరి శ్రీనివాస్ రాసిన పుస్తకాలను కొనుగోలు చేసి హిందూపురం, పరిగి, చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లోని ఉన్నత పాఠశాలల గ్రంథాలయాలకు అందించారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో నూతన ఇళ్ల నిర్మాణానికి ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులు పరిశీలించి నిబంధనల మేరకు గడువులోగా ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

నేడు ఉమానర్మదేశ్వరస్వామి కల్యాణం

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న ఉమానర్మదేశ్వర రాతి శివాలయం ప్రథమ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పార్వతీదేవి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, 108 బాణలింగాలు, చండీకేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా మొదలైయ్యాయి. వివిధ పూజలు, హోమాలు చేశారు. 14న పార్వతిదేవి విగ్రహ ప్రతిష్ట, ద్వాదశ జ్యోర్లింగాలు, 108 బాణాలింగాలు, చండీకేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రాణ ప్రతిష్టతో పాటు ఉమానర్మదేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

స్టార్టర్ల అపహరణ

మడకశిరరూరల్: మండలంలోని మరువపల్లి, చందకచెర్ల గ్రామాల్లో వాటర్ స్కీమ్ బోర్లకు అమర్చిన స్టార్టర్లు, కేబుల్ వైరును సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకెళ్లారని సర్పంచ్ ప్రభావతి బాయి తెలిపారు. అలాగే వ్యవసాయ బోర్ల కేబుల్‌ను అపహరించుకెళ్లారని తెలిపారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టామన్నారు.